అభివృద్ధి..సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

గుమ్మడిదల, కానుకుంట గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం

కానుకుంట కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, అక్టోబర్ 31: గడిచిన పదేండ్ల కాలంలో సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధే బీఆర్ఎస్‌కు విజయాన్ని కట్టబెడతాయని జడ్పీటీసీ కుమార్ గౌడ్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గుమ్మడిదలతో పాటు, కానుకుంటలో మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల సభ్యులతో బీఆర్ఎస్ నాయకులు విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్‌చెరు ఎమ్మెల్యే, ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. నాయకులు సద్దివిజయభాస్కర్‌రెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ గ్రామాల కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మూడు గ్రామాల్లో ప్రచారం

మండలలో వీరారెడ్డిపల్లి, మొల్లగూడెం,రాంరెడ్డిబావిలో బీఆర్ఎస్ ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ సద్దిప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్ గౌడ్ తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపు నిచ్చారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ మైనార్టీ నాయకులు

బీఆర్ఎస్‌లో మైనార్టీ నేతల చేరిక

కోహీర్, అక్టోబర్ 31: కోహీర్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. మంగళవారం కోహీర్ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ నాయకుడు రహేమత్ తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జి దేవీప్రసాద్, మండలాధ్యక్షుడు నర్సింహులు, పట్టణాధ్యక్షుడు వహీద్, సొసైటీ చైర్మన్ స్రవంతిరెడ్డి, ఇఫ్తికార్, కలీం, ఉమర్‌అహ్మద్, సుభాశ్‌రెడ్డి, గణేశ్‌రెడ్డి, సందీప్, సిద్ధు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

విజయానికి సంపూర్ణ సహకారం అందించాలి

ప్రచారం చేస్తున్న తుమ్మల సునీతా పాండురంగారెడ్డి

అమీన్‌పూర్, అక్టోబర్ 31: బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి మద్దతుగా అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి సతీమణి తుమ్మల సునీత మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి గూడెం మహిపాల్ రెడ్డి విజయానికి సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అమీన్‌పూర్‌లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆమె గడపగడపకూ వివరించారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

నాగల్‌గిద్ద, అక్టోబర్ 31 : ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ప్రత్యేక దృష్టి సారించి అధికారులు సమన్వయంతో పని చెయ్యాలని ఆర్డీవో వెంకటేశం అన్నారు. మంగళవారం మండలంలోని నాగల్‌గిద్ద, కరస్‌గుత్తి, గ్రామంలోని ఆయన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్,శివకృష్ణ, తదితరులు ఉన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహిస్తాం

పటాన్‌చెరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా

పటాన్‌చెరు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ దేవుజా

పటాన్‌చెరు, అక్టోబర్ 31 : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను పటాన్‌చెరు నియోజకవర్గంలో సజావుగా నిర్వహిస్తామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి డీ దేవుజా అన్నారు. మంగళవారం పటాన్‌చెరులోని నియోజకవర్గ ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవుజా మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల సంఘం పెట్టిన నియామావళిని కచ్చితంగా అమలు చేస్తామన్నారు. అభ్యర్థులు ఎన్నికల సంఘం పెట్టిన రూల్స్‌ను అతిక్రమిస్తే చర్యలుంటాయన్నారు. నవంబర్ 2న నామినేషన్ ఫామ్‌లు అభ్యర్థులు పొందవచ్చన్నారు. నవంబర్ 3నుంచి10 వరకు నామినేషన్లు తీసుకుంటామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, అవకతవకలు లేకుండా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. నోడల్ ఆఫీసర్ బన్సీలాల్ ఉన్నారు.

నేడు రేజింతల్ సిద్ధి వినాయక ఆలయంలో సంకష్టహర చతుర్థి వేడుకలు

న్యాల్‌కల్, అక్టోబర్ 31: మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో స్వయంభూవునిగా వెలిసిన సిద్ధి వినాయక ఆలయంలో బుధవారం సంకష్టహర చతుర్థి వేడుకలకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు స్థానిక ఆలయ ట్రస్టు సభ్యులు తెలిపారు.

చిరుత సంచారం.. వణుకుతున్న ప్రజలు

ఝరాసంగం/న్యాల్‌కల్, అక్టోబర్ 31: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని పలు గ్రామాల్లో చిరుత సంచారం కలకలం రేపుతున్నది. సోమవారం రాత్రి ఎల్గోయి గ్రామ శివారులో చిరుత సంచారాన్ని గ్రామానికి చెందిన రైతులు గమనించి సర్పంచ్ ఓం ప్రకాశ్ పాటిల్‌కు తెలుపగా వెంటనే సర్పంచ్ పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అయితే ఎల్గోయి గ్రామ శివారు నుంచి వివిధ గ్రామా ల మీదుగా చిరుత న్యాల్‌కల్ మండలంలోకి వెళ్లిందని గ్రామస్తులు తెలిపారు. మంగళవారం ఉదయం అటవీశాఖ అధికారిని రాధికా రెడ్డి ఆధ్వర్యంలో చిరుత సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించారు. చిరుత అడుగులు, గ్రామస్తులు తీసిన వీడియోను పరిశీలించిన అధికారులు చిరుత సంచారం నిజమేనని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధైర్యపడొద్దని, రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లొద్దని అటవీశాఖ అధికారిని సూచించారు. ముఖ్యంగా పశువులు ఉన్నవాళ్లు జాగ్రత్త వహించాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎవరికైనా చిరుత కనిపిస్తే వెంటనే 9966530594, 994976 3307 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

ఓల్డ్ ఎంఐజీ నూతన కార్యవర్గం ఎన్నిక

ఎమ్మెల్యే గాంధీని సన్మానిస్తున్న నూతన సభ్యులు

రామచంద్రాపురం, అక్టోబర 31 : భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజీ కాలనీలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన సభ్యులు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరికపుడి గాంధీని, భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డిలను కలిసి సన్మానించారు. భారతీనగర్‌లోని ఓల్డ్ ఎంఐజీ కాలనీ శేరీలింగంపల్లి పరిధిలోకి వస్తుంది. ఈ మేరకు గాంధీ నూతన కమిటీని అభినందించారు. అధ్యక్షుడు వెంకట్‌రావు, వైస్ ప్రెసిడెంట్ నారాయణగౌడ్, సెక్రటరీ సుబ్బారావు, ట్రెజరీ నిలకంఠ, డైరెక్టర్ రాములు, సీనియర్ సిటీజన్స్ వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, ఎంఎల్ఎన్‌రెడ్డి, బగర్దే తదితరులు పాల్గొన్నారు.

'చింత' నామినేషన్‌కు చిన్నారి ఆర్థికసాయం

కిడ్డీ బ్యాంకును ప్రభాకర్‌కు అందజేస్తున్న చిన్నారి రాశి

సంగారెడ్డి, అక్టోబర్ 31 : చిన్నారి రాశి పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి చింతాప్రభాకర్ నామినేషన్‌కు ఆర్థికసాయం అందజేసి శభాష్ అనిపించుకున్నది. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో తన కిడ్డీ బ్యాంకులో వేసుకున్న డబ్బులను ప్రభాకర్‌కు అందజేసింది. చిన్నతనంలో తన నామినేషన్‌కు సహకరించడం గొప్ప విషయమని చింతా ప్రభాకర్ సంతృప్తి వ్యక్తంచేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ కృష్ణాగౌడ్, నాయకులు విజయేందర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, కాసాల రాంరెడ్డి ఉన్నారు.

జిల్లాలో పోలీస్ 30 యాక్ట్ అమలు

సంగారెడ్డి, అక్టోబర్ 31 : జిల్లాలో నెల రోజుల పాటు 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని, పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెన్నూరి రూపేశ్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అనుమతి లేకుండా సమావేశాలు ఏర్పాటు చేస్తే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

క్షతగాత్రులకు పరామర్శ

అందోల్, అక్టోబర్ 31: రోడ్డు ప్రమాదంలో గాయపడి జోగిపేట ప్రభుత్వ దవాఖానలో చికిత్సపొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ మంగళవారం పరామర్శించారు. టేక్మాల్ మండలం కాద్లూర్ వద్ద మంగళవారం ఆటో-కారు ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా, మరో 9మంది గాయపడ్డారు. వీరిని జోగిపేట ప్రభుత్వ దవఖానకు తీసుకురాగా, ఎన్నికల ఇన్‌చార్జి ఫరూఖ్‌హుస్సేన్‌తో కలిసి దవాఖానకు వెళ్లి గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందిచాలని సూచించారు.

కురుమల ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి

రాయిపల్లి(సి)లో మాట్లాడుతున్న వరం వైస్ చైర్మన్ తుకారం కురుమ

రాయికోడ్, అక్టోబర్ 31: రాయికోడ్ మండలంలో నిర్వహించే కురుమల ఆశీర్వాద సభను విజయవంత చేయాలని వరం వైస్ చైర్మన్ తుకారం కురుమ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోడూర్, హస్నాబాద్, ఔరంగనగర్, సంగాపూర్, సింగితం, రాయిపల్లి (సి), నాగన్‌పల్లి, కర్చల్, ఇందూర్, మమిడిపల్లి, రామోజిపల్లి, పీపడ్‌పల్లి గ్రామల్లో నిర్వహించిన కురుమ సంఘం సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వచ్చే నెల 3న రాయికోడ్ మండల పరిధిలోని నాగ్వార్ గ్రామ శివారులో జరిగే అందోల్ నియోజకవర్గ కురుమ ఆశీర్వాద సభకు మండలంలోని అన్ని గ్రామాల్లో నుంచి అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగార్జున, నర్సుమ్మ అడివయ్య, నియోజకవర్గ కురుమ సంఘం నేత అంజి ఉన్నారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియ జేయునది ఏమగా, మా క్లయింట్ శ్రీమతి గడ్డమీది పద్మ, భర్త: గడ్డమీది రాములు, నివాసం: ఇం.నెం. 8-81, శ్రీనివాస నగర్ కాలనీ, రామచంద్రపురంవారు తెలంగాణ రాష్ట్రం, సంగారెడ్డి జిల్లా, మొగుడంపల్లి గ్రామం & మండలం పద్దగల i) సర్వే నెం. 35/ఆ, విస్తీర్ణం ఎ. 3.1700 గుంటలు మరియు ii) సర్వే నెం. 35/ఆ/2, విస్తీర్ణం ఎ. 1.2300 గుంటలు, మొత్తం విస్తీర్ణం ఎ. 5.000 గుంటల వ్యవసాయ భూములను (ఇకపై షెడ్యూల్ ఆస్తిగా రిఫర్ చేయబడును) కొనుగోలు చేయుటకు సంబంధించి భూమి యజమానులు శ్రీ తుమ్మన్‌పల్లి నారాయణ, తండ్రి: తుమ్మన్‌పల్లి మల్లప్ప, నివాసం: ఇం.నెం. 1-50, చిన్న హైదరాబాద్, జహీరాబాద్ మరియు శ్రీమతి తుమ్మన్‌పల్లి ఎల్లమ్మ, భర్త: తుమ్మన్‌పల్లి నారాయణ, నివాసం: ఇం.నెం. 4-60, చిన్న హైదరాబాద్, జహీరాబాద్ వారితో 27-10-2023 తేదీగల అమ్మక ఒప్పందం కుదుర్చుకున్నాను.

షెడ్యూల్ ఆస్తిపై లేదా దానిలో ఏదైనా భాగంపై ఏవైనా క్లెయిమ్‌లు, హక్కులు, హక్కు, టైటిల్, ప్రయోజనం, పెండింగ్ లిగిటేషన్, కౌలు, తనఖా, చార్జ్, లీన్ లేదా ఏదైనా స్వభావంగల ఏదైనా ఇతర ప్రయోజనంగల డిమాండ్ ఎవరైనా వ్యక్తి/వ్యక్తులు, సంస్థ, కంపెనీ, ఫర్మ్, ఇన్‌స్టిట్యూషన్ (కార్పొరేట్ లేదా ఇతర విధంగా)లకు ఉంటే, ఈ నోటీసు తేదీ నుండి 14 (పద్నాలుగు) రోజులలోగా అట్టి క్లెయిమ్‌కు మద్దతుగా అన్ని వివరాలు మరియు డాక్యుమెంట్లతో వ్రాతపూర్వకంగా దిగువ సంతకం చేసిన కౌన్సెల్ దృష్టికి తీసుకు రావాల్సిందిగా సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేడమైనది. లేనిచో, షెడ్యూల్ ఆస్తికి సంబంధించి ఎవరికీ ఏ విధమైన హక్కు, టైటిల్, ప్రయోజనం లేదా క్లెయిమ్ లేదని భావించబడును మరియు మా క్లయింట్ సందర్భాన్నిబట్టి ఆమె పేరున లేదా ఆమె నామినేట్ చేసిన వ్యక్తి (వ్యక్తుల) పేరున షెడ్యూల్ ఆస్తి యొక్క ఉద్దేశిత వ్యవహారాన్ని కుదుర్చుకొనుటకు మరియు పూర్తి చేయుటకు ముందుకు సాగుతారు. పైన తెలిపిన కాలం ముగిసిన తరువాత అందిన ఏవైనా అభ్యంతరాలు/లేదా క్లెయిమ్‌లు అనుమతించబడవు మరియు మా క్లయింట్‌ను బాధ్యులను చేయవు.

సం/- **M. షఫీయుద్దీన్,** అడ్వకేట్
ఇం.నెం. 7-41, మెయిన్ రోడ్, జహీరాబాద్,
సంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం,
ఫోన్: 8500055087.
ప్రదేశం: జహీరాబాద్, తేది: 31-10-2023.